క్లుప్తంగా

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న మణెమ్మ

పాల్వంచ: గిరిజన సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని భద్రాచలం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.మణెమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఏటీడీఓ కార్యాలయంలో దమ్మపేట డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు, వసతి గృహాల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులను చదువుతో పాటు, ఆటల్లోనూ రాణించేలా చూడాలన్నారు. పరిసరాలు, తరగతి గదులు, వసతి గదులు శుభ్రంగా ఉండేలా చూడాలని, ఆరోగ్యంపై నిత్యం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఏటీడీఓ చంద్రమోహన్, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బుచ్చిరాములు, దమ్మపేట డివిజన్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలొచ్చాయి



రమాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న గుంటి రమాదేవి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూలీలైన్ 2022 సంవత్సరం పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించారని వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి కొనియాడారు. బుధవారం పాఠశాలలో రమాదేవిని సన్మానించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. తాను పూర్వ విద్యార్థిగా పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రమాదేవిని ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుతో సన్మానించారు. దీంతో పాటుగా ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, హెచ్ఎంను సన్మానించారు.

అరబ్బీ ట్యూటర్ల వేతనాలు పెంచాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో పని చేస్తున్న అరబ్బీ ట్యూటర్ల వేతనాలను పెంచాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకుబ్‌పాషా బుధవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 204 పాఠశాలలు, 204 కళాశాలలో అరబ్బీ నేర్పించడానికి ఆలిమ్, హాఫీజ్‌లు పని చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



స్థానికులతో మాట్లాడుతున్న కార్తీక్

పాల్వంచరూరల్: గడపగడపకు జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధి బంద్రుగొండ, దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామాల్లో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేముల కార్తిక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వాధికారులు పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఒలపల్లి రాంబాబు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బస్ పాస్‌ల పంపిణీ



బస్ పాస్‌లు అందిస్తున్న రఫీ

సుజాతనగర్: విలేజ్ బస్ ఆఫీసర్ రఫీ ఆధ్వర్యంలో సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం బస్ పాస్‌లు పంపిణీ చేశారు. రఫీ మాట్లాడుతూ రూ.50 ఖర్చుతో విద్యార్థులకు ఆర్టీసీ 20 కి.మీ మేర బస్ పాస్‌లను అందిస్తోందన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు బాలురకు, 1 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు బస్ పాస్‌లు ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, దివ్యాంగులకు బస్‌పాస్‌లు, వివాహాది శుభకార్యాలు, విహారయాత్రలకు ముందస్తు రిజర్వేషన్, తిరుమల టికెట్లు తదితర సేవలను ఆర్టీసీ ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి





సుజాతనగర్: ఉట్టి కొడుతున్న చిన్నారులు

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో పలు శ్లోకాలు, నృత్యాలతో అలరించారు. ఆయా విద్యాసంస్థల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి గ్రావిటీ పాఠశాలలో...



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో...



పాల్వంచ: డీఏవీ పాఠశాలలో చిన్నారులతో ఉట్టి కొట్టిస్తున్న ఉపాధ్యాయులు



పాల్వంచ: కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు



సుజాతనగర్: శ్రీవాణి నికేతన్ పాఠశాలలో వివిధ వేషధారణలో ఉన్న చిన్నారులతో ఉపాధ్యాయులు

రూ.4.50 కోట్లు మంజూరు

జూలూరుపాడు: అనంతారం–నల్లబండబోడు మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ నిధులు రూ 4.50 కోట్లు మంజూరైనట్లు ఐటీడీఏ ఏఈ వెంకటనాగ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 4 కిలోమీటర్లు దూరం బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణ స్థలం సర్వే

పాల్వంచరూరల్: కారెగట్టు గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మించనున్న స్థలం ఫారెస్టు భూమి అని ఆ శాఖ అధికారులు భవన నిర్మాణాన్ని అడ్డుకోవడంతో వివాదస్పదంగా మారింది. దీంతో ఎంపీటీసీ రవి, సర్పంచ్ దుర్గ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కారెగట్టు గ్రామంలో అటవీ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ భూమి పట్టా భూమి అని రెవెన్యూ అధికారులు తెల్పారు. సర్వేలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ (డీఐ) ధర్మరావు, సర్వేయర్ నాగేశ్వరరావు, సెక్షన్, బీటీ ఆఫీసర్ సురేష్, సర్పంచ్ ఉన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కొత్తగూడెంరూరల్: జర్నలిస్ట్ డే సందర్భంగా బుధవారం జీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని జనహిత కార్యాలయంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు అంజి, కోఆర్డినేటర్ జోగారావు, గడల నరసింహారావు, శ్యామ్‌కుమార్, మిట్టపల్లి కిరణ్, అశోక్, ఆరెల్లి శ్రీను, మాలోతు శివ పాల్గొన్నారు.

పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు

టేకులపల్లి: ఇల్లెందు నియోజకవర్గంలోని పేద ప్రజలకు మెరుగైన కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించే లక్ష్యంతోనే హరిప్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టేకులపల్లిలో 100 పడకల ఉచిత వైద్యశాలను నెలకొల్పినట్లు ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, మాజీ ఏఎంసీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హరిప్రియ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలను ప్రారంభించారు. మాట్లాడుతూ.. అన్ని రకాల వైద్య సేంలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టేకులపల్లిలో కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యశాలను నెలకొల్పిన ఎమ్మెల్యే హరిప్రియను జెడ్పీ సీఈఓ విద్యాలత, టేకులపల్లి తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ కోట రాంబాబు, ఇల్లెందు ఎంపీడీఓ బాలరాజు ఆస్పత్రికి వచ్చి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

బీటీ రహదారులకు శంకుస్థాపన

ఇల్లెందురూరల్: పూబెల్లి, బోయితండా గ్రామపంచాయతీలలో బీటీ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ బుధవారం శంకుస్థాపన చేశారు. చీమల నాగరత్నమ్మ, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా ఉండాలి

ఇల్లెందురూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ బాలరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై గ్రామపంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. దళితబంధు, గృహలక్ష్మి, మైనారిటీ దరఖాస్తులను పరిశీలించి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. క్రీడా ప్రాంగణాలు, హరితహారం పథకాలపై శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

10న ఇల్లెందులో కాంట్రాక్ట్ కార్మికుల సదస్సు



మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 10న ఇల్లెందులో ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహించే కాంట్రాక్ట్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలీ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెంలోని జిల్లా కేంద్రంలో యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు సంవత్సరాలుగా వేతనాలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు సింగరేణి రివ్యూ మీటింగ్‌లలో ముఖ్యమంత్రితో కలిసి సింగరేణి సేఫ్ నిధుల గురించి తప్ప, ఇతర అంశాల ఊసే లేదన్నారు. ఈ రాష్ట్రంలో కార్మికులందరికీ వేతనాలు పెంచిన ముఖ్యమంత్రి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పెంచకపోవటం దుర్మార్గమన్నారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వల్ల వచ్చిన లాభాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటున్నాయని ఆరోపించారు. నియోజకవర్గాలలో అభివృద్ధి పేరిట డీవైదర్లు వేసుకుంటున్నారే తప్ప, కార్మికుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో పెద్దబోయిన సతీష్, ఎం.చంద్రశేఖర్, ఎం.రాజశేఖర్, నాగమ్మ, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

ఇల్లెందు: విద్యాశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఇల్లెందులో విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం సమావేశం జరిగింది. నాయకులు ఆనంద్, బి.వీరన్న, పి.రవి మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్, కేజీబీవీ, యూఆర్ఎస్‌లను విద్యాశాఖలో విలీనం చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి టైంస్కేల్ అమలు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతీ సెలవులు ఇవ్వాలని కోరారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జేఏసీ నిర్వహిస్తున్న రిలే దీక్షలకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ బుధవారం మద్దతు తెలిపింది. దీక్షా శిబిరాన్ని రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఎం.రాజయ్య, ఎం.పద్మారాణి, డి.దాసు, బి.బిక్కు, కె.వరలక్ష్మి సందర్శించి సంఘీభావం తెలిపారు. అదేవిధంగా పీఆర్‌టీయూటీఎస్ జిల్లా కమిటీ తరపున రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు డీవీ, మండలాధ్యక్షుడు సంగమేశ్వరరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు.

బీఎస్పీ మద్దతు ..

తమను రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు, ఎన్‌హెచ్ఎస్ వర్కర్ల నిరవధిక సమ్మెకు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ బుధవారం మద్దతు తెలిపారు. గంధం మల్లికార్జున్‌రావు, సాయి, చెనిగారపు నిరంజన్‌కుమార్, అల్లకొండ శరత్, ఎస్.సందీప్ పాల్గొన్నారు.

సింగరేణి లాభాల్లో వాటా చెల్లించండి..

ఇల్లెందు: 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలని, లాభాల్లో వాటా 35 శాతం వెంటనే చెల్లించాలని, అలవెన్సులపై ఆదాయపన్నును కోల్ ఇండియా తరహాలో యాజమాన్యం చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఇన్‌చార్జ్ మేనేజర్ మల్లారపు మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. సారయ్య మాట్లాడుతూ.. ఆగస్టు 14న సింగరేణి వ్యాప్తంగా వినతిపత్రాలు అందజేసినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. కార్మికుల సమస్యలపై గుర్తింపు సంఘం స్పందించకపోవటం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి సంఘాలకు కార్మికులు గుణపాఠం చెప్పాలని కోరారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, గడదాసు నాగేశ్వరరావు, ముస్తాఫా, వీరన్న, సుందర్, గుగులోత్ కృష్ణ, మంచాల వెంకటేశ్వర్లు, సంజీవచారి, నూనె శ్రీనివాస్, లచ్చిరామ్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



శ్రీలక్ష్మీమనోజ్ఞ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధి బట్టుతండాకు చెందిన వాంకుడోత్ రమేష్ – సునీత కుమార్తె వి.శ్రీలక్ష్మి మనోజ్ఞ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఆమె గత నెల 10న హైదరబాద్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సోనీ

జూలూరుపాడు: అన్నారుపాడు గ్రామంలో బుధవారం సర్పంచ్ బానోత్ పద్మతో కలిసి జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి సేవాసమితి ఇల్లెందు ఏరియా 2023–24 సంవత్సరానికి గాను ఇల్లెందు, టేకులపల్లిలో నిరుద్యోగ మహిళలకు నిర్వహించే వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం, కంప్యూటర్ కోర్సులలో శిక్షకులు కావాలని తెలిపారు. అదేవిధంగా ఉచిత శిక్షణ శిబిరాన్ని టేకులపల్లి, తిలక్‌నగర్ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి గలవారు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

మైనార్టీ బంధు ఇవ్వండి



ధర్నా చేస్తున్న ఆవాజ్ సభ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులైన మైనార్టీలందరికీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మైనార్టీ బంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆవాజ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ముస్లింలు మాట్లాడుతూ.. కొత్త దరఖాస్తులు కూడా తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా మైనార్టీ శాఖ అధికారి సంజీవరావు ధర్నా వద్దకు వచ్చి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఆవాజ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రహీం, అబ్దుల్‌నబీ, నిరంజన్, అబ్దుల్ రహమాన్, దొడ్డా రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆదేశానుసారం మండలంలో ముమ్మరంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. బుధవారం కుంటల్ల, తడికలపూడి, దుబ్బ తండా, బేతంపూడి, రామకృష్ణాపురం, గంగారం, మోదుగులగూడెం, పాతర్లగడ్డ, సిద్ధారం, తోలెం రామయ్య గుంపు, లచ్చాతండా గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

జంటనగరాలుగా తీర్చిదిద్దుతున్నా..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను జంట నగరాలుగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీలో రూ.20 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. పట్టణంలోని బర్మాక్యాంపు, చమన్‌బస్తీ, వడ్డెరబస్తీ, న్యూగొల్లగూడెం, మేదరబస్తీ, ప్రగతినగర్ ఏరియాలలో పర్యటించారు. మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఇంకా రెట్టింపుగా అభివృద్ధి చేస్తానని, తన కన్నా ఎవరైనా అభివృద్ధి ఎక్కువ చేశానని నిరూపిస్తే, దేనికైనా సిద్ధమన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, పట్టణంలోని ప్రజలకు క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేసి, కిన్నెరసాని జలాలను అందించామని, త్వరలోనే కొత్తగూడెంలోని పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కాసుల వెంకట్, ఎంఏ.రజాక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

రాజకీయ పక్షాలతో ఎన్నికల సమీక్ష



రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి కాశయ్య

ఇల్లెందు: ఎన్నికల వ్యవస్థలో ఓటరు నమోదు, జాబితా రూపకల్పన, మార్పులు, చేర్పులు అన్నీ కీలకమైనవేనని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా అందుబాటులో ఉంటుందని, ప్రతిఒక్కరూ తమ పోలింగ్ కేంద్రాల్లో లోటుపాట్లు, మార్పులు చేర్పులు ఉంటే సవరించుకోవాలని, ఆ మార్పులు చేర్పులు నమోదు చేసిప ఫారంలను స్థానిక బీఎల్ఓకు అందజేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్ఓ) జె.కాశయ్య అన్నారు. బుధవారం ఇల్లెందు తహసీల్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఓటర్ల మార్పులు, చేర్పులు అంశాలపై చర్చించారు. పోలింగ్ కేంద్రంలో బూత్ అధికారి(బీఎల్ఓ) అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని, ప్రతివారం జరిగే సమావేశంలో అన్ని విషయాలపై చర్చిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాలకు చేరిన దరఖాస్తులను పరిశీలించి వివరాలను వెల్లడించారు. ఫారం 9, 10, 11, 11బీలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేశారు. ప్రతీ రాజకీయ పార్టీ తమ పోలింగ్ కేంద్రంలో ఒక పోలింగ్ ఏజెంట్‌ను నియమించుకోవాలని చెప్పారు. ఇలాంటి అంశాలు పరిశీలన కోసమే రాజకీయ పార్టీలతో పదేపదే సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ముద్రగడ వంశీ, చాందావత్ రమేష్‌బాబు(టీడీపీ) బలగానీ గోపీకృష్ణ, రామచంద్రనాయక్, మురళీకృష్ణ (బీజేపీ), బుర్ర వెంకన్న (ప్రజాపంథా), ఎస్‌ఐ నబీ (సీపీఎం), ఉడుత ఐలయ్య (సీపీఐ), డానియేల్, పులి సైదులు, దేవా (కాంగ్రెస్), తహసీల్దార్లు కె.రవికుమార్ (ఇల్లెందు), భగవాన్‌రెడ్డి (బయ్యారం), స్వాతిబిందు (గార్ల), లక్ష్మి (కామేపల్లి), ఎలక్షన్ డీటీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం

టేకులపల్లి: పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం.తార అన్నారు. బుధవారం టేకులపల్లి, కోయగూడెం, సులానగర్, గంగారం, బోడు సెక్టార్ల పరిధిలో సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్లు నిర్మల, లక్ష్మి, యశోధ, అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాల్వంచ: పోషణ్ మాసోత్సవంలో భాగంగా బుధవారం వెంగళరావు కాలనీ సెక్టార్‌లోని రాహుల్ గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ వసంతరాణి, కల్యాణి, లక్ష్మీకుమారి, జానకి, భద్రమ్మ, రమాదేవి, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: పట్టణంలోని 15వ వార్డు వెంగళరావు అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం స్థానిక కౌన్సిలర్ చీమల సుజాత చేతుల మీదుగా పోషణ మాసోత్సవం కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఏసీపీ పీఓలు విజయలక్ష్మి, సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్ శారద, మెడికల్ ఆఫీసర్ విజయశ్రీ, గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ్ సంస్థ సతీష్ ఖండేల్‌వాల్ తదితరులు పాల్గొన్నారు.



పోషణ మాసోత్సవంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పోడు సాగుదారులందరికీ పట్టా హక్కులు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం మార్కెట్ యార్డ్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంచుతున్నామనే పేరుతో ప్రజలను మచ్చిక చేసుకుని ఎన్నికల్లో లబ్ధి పొందే ఆలోచన తప్ప, చిత్తశుద్ధితో సాగుదారులకు పట్టాలు ఇవ్వడానికి కాదన్నారు. రాష్ట్రంలో అనేక మంది పేదలకు నేటికీ పట్టాలు రాక ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని, ఫారెస్ట్ అధికారులు బెదిరిపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి పోడు భూములు సర్వే చేసి కొంత మందికి మాత్రమే పట్టాలు ఇచ్చి వేలాది మంది దరఖాస్తులను తిరస్కరించారని విమర్శించారు. ఇప్పటికైనా సర్వే చేసిన ప్రతి అంగుళం భూమిని సాగు చేస్తున్న ప్రతి పేదవాడికి పట్టా హక్కులు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాచర్ల సత్యం, ఆజాద్, బానోత్ ధర్మ, పూణే నాగేశ్వరరావు, కుంజా లక్ష్మయ్య, గుగులోత్ రాంచందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.